# ఎండమావులు



= రచన . మాష్టర్ రవి =


బిందె పట్టుకుని చెరువు కెళుతున్న నీరజను చూసి కళ్లు తుడుచుకున్నారు అత్తమ్మగారు.

నీరజను తల్చుకుంటే ఆమెకు చెరువవుతుంది. నీరజకు జరిగిన అన్యాయానికి తానే కారకురాలని, ఎవరో వ్రేలెత్తి చూపుతున్నట్టు అనిపించింది.

ఇరవై ఏళ్ళు నిండని పసిమి ఛాయల అమాయక నీరజ, పెళ్ళి అయిన సంవత్సరంలోనే పసుపు కుంకుమ లకు  రమైందంటే, అది తన నేరమే అని; తనే తన చేతులారా నీరజ భవిష్యత్తు నాశనం చేసిందని నిందించుకుంది. అది నిజమేనేమో!...

× × ×

నీరజ కూడ మాధవుణ్ని ప్రేమించింది. అతనంటే ఆమెకెంతో ప్రేమ గౌరవం. కానీ, నీరజకంటే,



ఆమె భవిష్యత్తు తనకే ఎక్కువ తెలిసినట్టు; అంతా తన చేతిలోనే వున్నట్టు; నీరజను మాధవరావునుండి వేరు చేసింది. మాధవరావు మంచి కుర్రవాడు. విశాలభావాలు గల నవయువకుడు. జాతి మతాలన్నా, వర్ణవర్గ విభేదా లన్నా—అతనికి ఒళ్లు మంట. మానవ కల్పితాలైన ఈ కులాలగూర్చి అతనికేమీ సదభిప్రాయం లేదు. కులం కంటే, గుణానికే అతడు ప్రాధాన్యత ఇస్తాడు.

ఓ సారి మాధవరావు తనతో మాట్లాడుతూ—"బ్రాహ్మణులే ఎక్కువనీ; శూద్రులుతక్కువ నీ-ఇలాంటి డాంబికాలకు నేనాట్టే విలువివ్వను. పెద్ద కులమని చెప్పుకునే ఎంతమంది దారితప్పి, తప్పటడుగులు వేయ టం లేదు? నన్నడిగితే, ప్రపంచమంతా రెండే రెండు జాతులు. ఆడజాతి - మగ జాతి. మిగతావన్నీ మ స్వప్రయోజనాలకోసం ఆధిక్యత కోసం మనమే సృష్టిం చుకున్న ఇనుప తెరలే. బ్రాహ్మడు వేదాలు చదవా లన్నారు. ఈనాడు ఎంతమంది బ్రాహ్మణులకు వేదా లొచ్చు? అసలు వేదాలంటూ వున్నాయని ఎంతమందికి తెలుసు? వైశ్యుడు వ్యాపారం చెయ్యాలన్నారు. ఈ నాడు ఎంతమంది వైశ్యులు వ్యాపారం మాత్రమే చేస్తు న్నారు?...కాబట్టి హృదయ నైర్మల్యం, చక్కని గుణం ప్రధానం గాని, ఈ జాతి మతలేమిటండీ?—", అని అన్నాడు.

తనది శాస్త్ర చాంధస లక్షణం. అంచేత అతని మాటలు తనకేమీ రుచించలేదు సరికదా; మాధవరావు వంటివారివలె కుటుంబ మర్యాదలు; వంశప్రతిష్ఠలు వమ్మై పోతున్నాయని, మనసులో బాధపడింది. ఆ మాటలు,

చాటునుండి వింటున్న నీరజపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతాయో—అని కూడ తాను భయపడింది.

తన నీరజ కూడ విశాల భావాలు కలదే! మాధవరావు భావాలతో, పూర్తిగా ఆమె కూడా ఏకీభవించేది. అతని ఆశయాలగూర్చి, నీరజ ఎక్కువగా మాట్లాడుతూంటే; తన వంటిమీద తేళ్లు, జెర్రెలు ప్రాకుతున్నట్టనిపించింది.

అసలు తనకి మాధవరావుమీద సదభిప్రాయం కలక్కపోవడానికి కారణం అతని ఆర్థిక పరిస్థితే. అతనికి, భగవంతుడిచ్చిన] అందం, తెలివి తేటలు, నిర్మలమై, అమాయకమైన హృదయం—తప్ప, వేరే ఆస్తి ఏమీ లేదు. డబ్బులేందే, నేటి సాంఘిక జీవితమే లేదనే మాట వాస్తవమే అయినా; కేవలం డబ్బు వల్లే అన్ని పనులూ జరగవని తానానాడు వూహించలేక పోయింది. అలా వూహించి, మాధవరావుకి తన నీరజను ఇచ్చి వుంటే; ఈనాడు దాని గతి ఇలా ఔనా?

ఆరక్షణంలో అందరినీ ఆకట్టగల అందం, తన తియతీయని మాటలతో ఇతరుల హృదయాలను దోచుకునే వాక్ప్రవాహం, మంచి అణకువ, చదువు సంస్కారం గల తన నీరజను, ఎమ్. ఏ. పాసై, బాగా డబ్బుండి దాని అన్ని అవసరాలు తీర్చగల వ్యక్తికి ఇద్దామని, తానాశించింది. నిజానికి, తాను ఒక తల్లిగా అలా ఆశించడంలోనూ, ఆలోచించడంలోనూ తప్పేముంది గనుక? అది సహజం కూడా.

అయితే, ఇది వట్టి అమాయకత్వమని, జీవితాలు నిర్ణయించడంలో మన కేమాత్రమూ ప్రజ్ఞ లేదని, వున్నదనుకోవడం అవివేకమనీ; అందరి జీవిత పథగమనాలూ నిర్ణయించేది ఆ సర్వాంతర్యామే అనీ; తానాడు గ్రహించలేక పోయింది. ఆ సత్యాన్ని నీరజ జీవితమే ఋజువు చేసింది.

అనుకున్నవి ఎప్పుడూ అనుకున్నట్టుగా జరగవ్. అలాగే జరిగితే ఈ భువి, ఏనాడో దివిగా మారే వుండేది. మానవుల జీవితాలు సుఖశాంతుల నిలయాలై వుండేది.

స్వర్గాన వున్న వారు కూడా ఎంతో చెప్పారు. ఎవరెవరెంత చెప్తే ఏం? తన పట్టుదల తనదే అయింది...అంతా మన చేతుల్లో వుందనుకోవడంవల్లనే అఘాయిత్యాలు జరుగుతుంటాయ్.

వారికి మాధవరావంటే చాలా అభిమానం. ఎంతో గౌరవం...

“అతనితో గంటల తరబడి సాహితీ చర్చ చేసినా విసుగు అనిపించదే—” అనే వారాయన.

ఓరోజు—'లక్ష్మీ! మన నీరజను మాధవరావుకి మాధవరావుకి ఇచ్చి చేస్తే బాగుంటుందని నా వూహ

USE ALWAYS
KEYENPEE
FABRICS
FAST COLOUR
TRADE MARK
HIGH CLASS TEXTILES
150
HIGH CLASS
HANDLOOM PRODUCTS
MADE IN SOUTH INDIA

Tel : "KEYENPEE" Phone : 30,
P. B No 15.

**K. N. P.**

**PERIANNA MUDALIAR**

**HANDLOOM WEAVING FACTORY**

**KARUR (S. I.)**

*Manufacturers of Handloom Fabrics :*

- Bedsheets
- Table Cloths
- Pillow Covers
- Napkins
- Furnishing Fabrics

*Branch at :*

**No. 190, JAMNALAL BAZAZ STREET**
**CALCUTTA-7**

అతనా చక్కనివాడు; బ్రతకనేర్చినవాడు; అమ్మాయంటే, అతనికి అభిమానం లాగే కనిపిస్తూంది. అతని మాటలవల్ల అది నేను గ్రహించాను. మన నీరజకు కూడా అతనంటే ప్రేమలాగే కనిపిస్తోంది. అభిమానించుకుంటున్న వారిద్దర్నీ ఏకం చేయడం మన ధర్మం కూడా. ఏమంటావ్?...'' అన్నారు.

'అదేం కుదరదండీ! దమ్మిడీ ఆస్తిలేక, మామూలు గ్రేడ్యుయేటు అయిన ఆ కుర్రాడికి నా కూతురు నిచ్చి దాని జీవితం బాధలపాలు చేయలేను. దానికేం తెల్సు? చిన్న పిల్ల. మనం అన్నీ దూరంగా ఆలోచించి; దాని జీవితానికి మంచి కొమ్మనందివ్వాలిగాని, అదెవర్నో కోరుకుంటోందని, మనం, "ఊ'' అనలేం గదా?...మీరెన్ని చెప్పండి! ఆమాధవరావుకి మాత్రం నాకూతుర్ని ఇవ్వను. ఇవ్వలేను. ఆడదాని జీవితం నిర్ణయించాల్సింది ఆడదే... మా వదినగారు సంబంధం వుందనీ; అబ్బాయి ఎం. ఎ; అని; బాగా పరులనీ చెప్పింది...ఆ సంబంధం చూడ్డానికి, ఈ ఆదివారమే తెనాలి వెళ్తున్నాను. దయచేసి ఈ విషయంలో మీరు నన్ను బలవంతం చేయకండి...'' అంది తను.

"అదికాదే నీరజ భవిష్యత్తు నీకెంత ముఖ్యమో, నాకూ అంతే అని ఒప్పుకుంటావుగా! నువ్వు నైర్మల్యం, గుణగుణాలు చూట్టం లేదు...ఒక అమాయక అనవసరంగా త్రోళిస్తే, వచ్చే పరిణామం నువ్వు గ్రహించటం లేదు కూడ. అమ్మాయికి, ఎలాగూ నువ్వు చూసే సంబంధం ఇష్టపడదు. దాని సంగతి ముందే నాకు తెలుసు. అది మాధవరావుని ప్రేమించింది. కానీ, చెప్పలేక పోతోంది. ఆఖరికి చెప్పదు కూడ. నువ్వు చూసే సంబంధమే ఇష్టంలేక పోయినా చేసుకుంటుంది...దానికేదో సుఖశాంతుల్ని ఇస్తున్నాననుకుని; దాన్ని చేజేతులా నరకంలోకి తోస్తున్నావు. చెప్పాల్సింది చెప్పాను. ఇక నా పైన నీయిష్టం...'' అంటూ ఆయన ఆ విషయం ఆపేశారు.

నీరజ ఈ మాటలు పొంచుండి విని, కుమిలి కుమిలి ఏడవటం తానానాడు చూసింది. కానీ, మొండికెత్తి, అంతా తన చేతుల్లోనే వున్నట్టుగా; ఆ రంగారావుకి క్రితం సంవత్సరమే నీరజను ఇచ్చింది.

నీరజ గంభీరంగా నవ్వుకుంది.

పెళ్ళికి మాధవరావు కూడ వచ్చాడు. అతనికో మంచితనం వెల్లివలై కనబడసాగింది. నిండు మనసుతో నీరజ వివాహం దగ్గర వుండి జరిపించాడు. హృదయపూర్వకంగా నవ వధూవరుల నాశీర్వదించాడు. మంగళ సూత్రధారణ సమయాన మాత్రం, మాధవరావు ఆపుకోలేని మనోవ్యధతో, నీరజ వైపు చూసి,కళ్ళు తుడుచుకున్నాడు...నీరజ నిస్తేజ అయింది. అంతకన్న భారత స్త్రీ ఏం చెయ్యగలదు కనక?...

మాధవరావు ఆ నాటినుండి ఇంటికి రాకపోకలు బాగా తగ్గించాడు.

తెనాలిలో, నీరజ రంగారావుతో కాపురం మొదలు పెట్టిన తొలిదినాల్లోనే గాబోలు, వారికి బ్లడ్ ప్రషర్ వచ్చింది. "ఏ ముహూర్తాన అల్లుడొచ్చాడో గాని; మామగారి ప్రాణాల్నే హరించాడు—'' అని అంతా అంటూంటే. తను వినలేక పోయింది. ఆ నాడు-అంటే-నేటికి సరిగ్గా ఆర్నెల్లక్రితం తొలిసారిగా "తాను చేసింది పొరపాటేమో'' అనిపించింది తనకు.

ఆయన ఆఖరి క్షణాన 'లక్ష్మీ—! ఇలారా...కాస్త దగ్గరగా రా...అయిపోయింది...ఈ దీపం ఇక అట్టే సేపు వెలగదు. కానీ, నువ్వు నీ నీరజకు అన్యాయం చేశావ్. అతడు...ఆ రంగారావ్...చదువుకున్నాడన్నావ్. ఆస్తి పరుడన్నావ్. కానీ...ఈనాడు తెలిసిందా? చార చారలూ, బజ్జి బజ్జలూ అన్నీ బయట—పడుతున్నాయా? పరిపూర్ణ ఆనే క్రిష్టియన్ అమ్మాయిని అతను వుంచుకున్నాట్ట. చెప్పుకుంటే సిగ్గు... తాగుతాట్టకూడా. ఇక నీకూతురికి సుఖశాంతు లెలా లభిస్తాయ్? చదుకన్నావ్, డబ్బున్నావ్. చదువుకన్నా సంస్కారం ముఖ్యం లక్ష్మీ! డబ్బుకన్న గుణం కావాలి. ఇంతకన్న ఇంకేం చెప్పను?...'అంతిమశ్వాస'' వదిలేశారు వారు.

× × ×

'అమ్మా! అన్నం మాడి పోతున్నట్టుందే. ఏమిటా పరధ్యానం?—' అంటూ నీరజకేక లేసేవరకూ, స్మృతిలోకి రాలేక పోయారు లక్ష్మమ్మగారు.

ఆలోచనా సముద్రం నుండి, ఒక్కసారి వాస్తవానికి వచ్చి, నీరజ ముఖం చూసేసరికి, ఆమెకు దుఃఖం ఉప్పెనగా పొంగి పొర్లింది.

నవనవలాడుతూ, లక్ష్మీకళతో, సీతామ్మ వారిలా వుండే నీరజ ముఖం, వసి వాడి, కెంధూళులతో కలిసిన కుసుమంలా నలిగి, నవసి, నిస్సహాయంగా, జాలిగా తయారైంది.

మూర్తీభవించిన శోకదేవతలా వున్న నీరజను గట్టిగా కౌగిలించుకుని భోరుమన్నారు లక్ష్మమ్మగారు, చేసిన స్వయంకృతాపరాధానికి ప్రతిగా.

× × ×

నీరజ రేడియో వేసింది. హైదరాబాదు నుండి కార్మికుల కార్యక్రమం వస్తోంది. లక్ష్మమ్మగారు నేలమీద పడుకున్నారు.

'...ఇప్పుడు ధవళపురి మాధవరావుగారి కథానిక..' అంది ఎనౌన్సర్.

నీరజహృదయం ఎందుకో ఒక్కసారి భగ్గుమంది.

లక్ష్మమ్మగారు గబుక్కున లేచి '...మన మాధవరావే...' అంది నీరజతో.

అమాయకంగా, నీరజ 'ఔనమ్మా' అంది.

రేడియో పలుకుతోంది...

“జీవితం పువ్వువంటిది. ఎంతమాత్రపు ఎండకైనా పువ్వు వాడిపోయినట్టే. ఏ మాత్రపు ఘాతానికైనా, హృదయం దెబ్బ తింటుంది...అలాగే సుందరమ్మగారి మాటలు విన్న గోపాలం కృంగిపోయాడు. సరళా, తనూ మనస్ఫూర్తిగా ప్రేమించుకున్నా; ఏ ఒక్కరికీ పెద్దలతో చెప్పుకునే ధైర్యం లేక పోయింది. అయినా సరళ తండ్రి జానకిరామయ్యగారు, గోపాల్‌ని అల్లునిగా చేసుకుందుకు నిశ్చయించుకున్నారు. కూతురి మనస్సు తెలిసికొని గోపాల్ ఆనందానికి అవధుల్లేక పోయాయ్. వెలుగు నీడలు ప్రక్క ప్రక్కనే వుంటాయి. విధి మానవుణ్ని శాసించడానికే చూస్తూంటుంది. అదే అయింది గోపాల్ పరిస్థితి. సరళ తల్లి సుందరమ్మగారికి ఈ సంబంధం నచ్చక, ఇంకో సంబంధం చూసింది...రామారావుతో సరళ వివాహం జరిగిపోయింది...పెద్దల్ని ఎదిరించి, గోపాల్ సరళలు రిజిష్టరు పెళ్ళి చేసికోగలరు. కానీ...తమవల్ల కుటుంబ విచ్ఛిన్నం; మనస్పర్ధలూ...ఇట్లాంటివి జరగటం ఇష్టం లేక, విధికి తలొగ్గారు...ఒక రోజు...'

మధ్యలో మరి వినలేక '...అపు నీరజా ...' అన్నారు లక్ష్మమ్మగారు.

తనకు తెలియకుండానే జారిన కన్నీటిని తుడుచుకుంటూ; రేడియో ఆపింది నీరజ.

లక్ష్మమ్మగారి హృదయంలో ఎవరో గుండు విసిరినట్టయింది...విధి తనని వెక్కిరిస్తోంది...తిరిగి ఆలోచనలో పడ్డారు ఆమె.

× × ×

వారు పోయాక తాను నీరజవద్దకు తెనాలి వెళ్ళింది. అక్కడ రంగారావు నిజస్వరూపం చూసి విస్తుపోయింది. రోజూ రాత్రి ఒంటి గంటకు ఇల్లు చేరేవాడు. నీరజ అంటేనే అతనికి అసహ్యం. ఆ క్రిష్టియను పిల్లలా, బొట్టు చెరిపేసి; మెళ్ళో శిలువ వేసుకోమంటాడు. శిలువ వేసికొందుకు అభ్యంతరం లేక పోయినా, భర్తవుంటూ బొట్టు చెరిపేసుకుందుకు ఏ భారత స్త్రీ అంగీకరిస్తుంది? ఎవరెవర్నో అనుకరించమని, రోజూ వేధించుకు తినేవాడు. బాబ్ హెయిర్ చేయించుకోమని; చేతికున్న గాజులన్నీ తీసేసి. ఒక్క రిస్టు వాచి మాత్రమే వుంచుకోమనీ, ఎపుడూ తనతో ఇంగ్లీషే మాట్లాడమని; రోజుకి రెండుసార్లు షాంపూబాత్ చేసికోమని...ఇలా వేధించుకు తినేవాడు. నీరజ ఎంతని సహించగలదు? అనేకమంది పాశ్చాత్యులు, భారతీయుల అందానికి, అణుకువకు, నమ్రతకు, అలంకారాలకు ముగ్ధులై, మనని అనుకరిస్తూంటే, ఇది మన దౌర్భాగ్యం కాకపోతే; వారిని మనం అనుకరించడమేమిటి?...నాగరికత అంటే ఇదే గాబోలు? నైతికంగా పతనం చెంది, భౌతికంగా అభివృద్ధి చెందడమేనా నాగరికత అంటే?...

ఆ వేళ...పరిపూర్ణను ఇంటికి తీసికు వచ్చి, సరాసరి పడగ్గదిలోకి వెళ్ళి; నీరజను కాఫీ తెమ్మన్నాడు. ఎంత అఘాయిత్యం? ఎంత అన్యాయం? కట్టుకున్న భార్య చేత, ఉంపుడు కత్తెకు వూడిగం చేయించాడు తన ఎదురుగానే.

“అనాడు తను గట్టిగా అనుకుంది. 'రంగారావుకి తన నీరజను ఇచ్చి దానిజీవితం నేనే నాశనం చేశాను'అని.

'అమాయకుడైన మాధవరావు బాధే ఇలా బెడిసి కొడుతోందేమో?' అని కూడ అనుకుంది.

అది జరిగిన నెలకే గాబోలు...రంగారావుకి గుండె నొప్పి వచ్చింది. అంతే నీరజ బ్రతుకు నీటి పాలైంది.

ఆఖరికి ఆస్తికూడా అతను ఆ క్రిష్టియను పిల్ల పేరే వ్రాశేశాడు. దావాలు—తంటాలు—పడితే తమ ఆస్తి తమకు రావచ్చు, కా ...చూసే మగ దిక్కేది?

తానే ఇంత బాధపడుతోంది! మరి నీరజ వేదనకు అంతేమిటి?...ఇలా ఇలోచిస్తూ ఎప్పుడో నిద్ర పోయారు లక్ష్మమ్మగారు.

× × ×

తలుపు తెరిచి, అక్కడ నిల్చున్న వ్యక్తికేసి చూసి, స్థాణువై పోయింది నీరజ.

మాధవరావు చేతిలో దబ్బ పండువంటి పాపాయి, నీరజను చూసి నవ్వుతూ, ముందు కురక బోయాడు.

ఓ నిముషానికి తెప్పిరిల్లి ...లోనికిరండి... అంది నీరజ.

ఆమెను చూస్తూ, గద్గదికంగా '—నీరజా! అంతా విన్నాను. నా గుండె చెరువైంది. ఏమీ చెయ్యలేని, నిర్వికార స్థితిలో వుండి పోయాను. ఇంతటి విధి విద్యుత్ ఘాతానికి ఎలా తట్టుకోగలిగావ్ నీరజా! భగవంతుడు జాలిలేని కసాయివాడైనాడు నీ పట్ల. ఇటు తండ్రిని, అటు భర్తని ఒక్కసారే లాక్కుపోయాడు. కష్టాలు వంటరిగా రావనేది నీ పట్ల నిజమైంది...ఆఁ...అమ్మగారేరీ?...' అన్నాడు మాధవరావు.

నీరజ కళ్ళు తుడుచుకుని, నేలని చూస్తూ '—వంటింట్లో వుంది. పిలుస్తాను...' అంటూ లోనికి వెళ్ళి పోయింది.

మాధవరావు చేతిలో పాపాయి "అమ్మా" అంటూ నవ్వసాగేడు. నీరజ వెనక్కు చూసి; వంటింట్లోకి నడిచింది.

లక్ష్మమ్మగారు మాధవరావుని చూడగానే భోరుమన్నారు. చల్లగాలి తగిలిన మేఘాల్లా, ఆమె కళ్లు జలవర్షించాయ్. మాధవరావు కూడా కళ్లు తుడుచుకున్నాడు.

'...దేముడు మమ్మల్ని చిన్నచూపు చూశాడు నాయనా! ఏం చేస్తాం? అందిన ఆహారం వదులుకొని; పొదలో పిట్టలకోసం ఎగబ్రాకిన వేటగాని బ్రతుకైంది మాది. ఇంతకీ నా మూర్ఖత్వమే కారణం. నా తప్పుకి నిష్కృతి లేదు నాయనా!...మా బాధలకేం గాని నాయనా...ఇపుడు నువ్వేం చేస్తున్నావ్?..."ఈ బాబు అర్థోక్తిలో ఆగిపోయారు లక్ష్మమ్మగారు.

'ప్రస్తుతం నేను హైదరాబాదు రేడియో స్టేషనులో పని చేస్తున్నాను. ఈ బాబు, మా అక్కయ్య కొడుకు. మా బావగారు ఇక్కడే పని చేస్తున్నారు. దరిమిలా ట్రాన్స్‌ఫర్ మీద వచ్చారిలెండి. ఈ కుటుంబ విషాధ గాధంతా వారే చెప్పారు. చాలరోజులైంది కదా అని మిమ్మల్ని చూసి పోదామని వచ్చాను. కాని ఇలాంటి పరిస్థితిలో మిమ్మల్ని చూస్తానని, కల్లోకూడ అనుకోలేదు. నీరజ ఎవరినైనా; కలకల్లాడూ, జీవితాన్ని అనుభవిస్తుండటమే కావాలని ఆశించాను. కానీ...'

ఏమీ జవాబు చెప్పలేక, నీరజ-లక్ష్మమ్మ, గారలు, లోలోన కుమిలి పోసాగారు.

'—నేను నా జీవితంలో బ్రహ్మచారిగానే వుండి పోదామని నిశ్చయించుకున్నాను. కానీ, మా అక్కయ్య పూరుకోవటం లేదు.—'పెద్ద కబుర్లాడతావ్. బాధలకు వొంగిపోయి, విధికి బానిస కాకూడదంటావ్. అందని వాటికి ఆశించకుండా, వున్న దాంట్లో ఆనందాన్ని అనుభవించాలంటావ్. ఇవన్నీ కథల్లో వ్రాయటానికేనా? నీకో మంచి సంబంధం చూశాను. ఈ నెల్లో పెళ్ళి జరిగి పోవాలి—' అంటూ నన్ను నిలదీసింది. నేనేమనేది?. ఎవరైనా జీవితంలో ప్రేమించేది ఒక్కసారే! అది సఫలీకృతం అయినా, కాకపోయినా, ఆ వ్యక్తులు మరి హృదయం నుండి తొలగిపోరు...అలాగని, చీకట్లోనే వుండి పోలేం గదా? జీవితాలు ఎండమావులు...ఇదిగో శుభలేఖ... ఈ నెలాఖర్నే పెళ్ళి. ఈ వూళ్లోనే. వస్తాను నీరజా...వస్తానమ్మా...' అంటూ శుభలేఖ, నీరజ చేతికిచ్చి' వీధిలోకి నడిచాడు మాధవరావు.

నీరజ చేతిలో శుభలేఖ గాలికి టపటప లాడుతోంది.

మా ఖాతాదారులకూ - శ్రేయోభిలాషులకూ హృదయపూర్వకమైన
దీపావళి అభినందనలు !!
దీపావళినాడు యావత్ భారత ప్రజలందరూ మా టపాసు
రకాలను వాడి ఆనందము పొందాలని
ఆశిస్తున్నాము !!
Trade Mark
ROYAL FIREWORKS INDUSTRIES
Tel : ROYAL. SIVAKASI (S. I.) Phone : 22.